'సాధికారత'తోనే మహిళకు 'భవిష్యత్'

తిరుపతి వేదికగా జాతీయ సదస్సు ప్రారంభం

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో: 'మహిళల సాధికారత అనేది ఒకేసారి జరిగే కార్యాచరణ కాదని, నిరంతర ప్రక్రియని, గ్రామపంచాయతీ నుండి పార్లమెంట్ వరకు మహిళల ప్రాతినిధ్యం పెరగాలని, అమత్ కాలంలో నారీ శక్తి దేశాన్ని సమగ్రత, శక్తివంతమైన భవిష్యత్తు వైపు నడిపించే అప్రతిహత శక్తిగా రూపుదిద్దుకుంటోంది' అని అన్నారు. మహిళల సమానత్వం, నాయకత్వం, భాగస్వామ్యం – న్యాయం మాత్రమే కాకుండా, సమగ్ర, స్థిరమైన అభివద్ధికి పునాది అని స్పష్టం చేశారు. తిరుపతి వేదికగా రెండు రోజుల పాటు జరగనున్న రాహుల్ కన్వెన్షన్ సెంటర్‌లో మహిళాసాధికారత సదస్సును జాతీయగీతం, రాష్ట్రగీతాలాపనతో ఆదివారం ఉదయం ప్రారంభించారు. పార్లమెంటరీ మహిళా సాధికారత కమిటీ అధ్యక్షురాలు డి. పురందేశ్వరి, రాజ్యసభ ఉపాధ్యక్షుడు హరివంశ్, ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, ఉప సభాపతి రఘురామ కష్ణంరాజు, ఆంధ్రప్రదేశ్ ఆర్థిక, శాసనసభ వ్యవహారాల శాఖా మాత్యులు పయ్యావుల కేశవ్, రాష్ట్ర మహిళా సంక్షేమ కమిటీ చైర్పర్సన్ గౌరు చరితారెడ్డి, ఆంధ్రప్రదేశ్ శాసన వ్యవస్థ సెక్రటరీ జనరల్ ప్రసన్న కుమార్ సూర్య దేవర లతో కలసి లోక్ సభ స్పీకర్ ఓం బిర్లా జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. పోలీసు గౌరవ వందనాన్ని స్వీకరించారు. తిరుపతి జిల్లా ప్రజాప్రతినిధులు లోక్‌సభ స్పీకర్‌కు పుష్పగుచ్చాలు అందించి శాలువా కప్పి సత్కరించారు. కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్, నగర పాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య స్పీకర్‌కు పుష్పగుచ్చాలు అందించారు. ఫొటో ఎగ్జిబిషన్‌ను ప్రారంభించి సభ్యులతో కలిసి తిలకించారు.

భారత పార్లమెంట్ మహిళా సాధికారత కమిటీ చైర్ పర్సన్ పురందేశ్వరి మాట్లాడుతూ 2047 నాటికి వికసిత్ భారత్ యొక్క లక్ష్యాలను సాధించడంలో సమానత్వం, సమ్మిళితత్వం, సాధికారత యొక్క ప్రాముఖ్యతను వివరించారు. మహిళా నేతత్వంలోని అభివద్ధి భారతదేశ జాతీయ వ్యూహంలో ఒక ముఖ్యమైన అంశమని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పేర్కొన్నారన్నారు. విద్య, పారిశ్రామికత, ఆరోగ్యం, డిజిటల్ అక్షరాస్యత ద్వారా మహిళలను ప్రోత్సహించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని , బేటీ బచావో, బేటీ పఢావో, స్టాండప్ ఇండియా, మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికేట్, ప్రధానమంత్రి జన్ ధన్ యోజన వంటి పథకాల అమలు ద్వారా మహిళలు ఆర్థికంగా అభివద్ధి చెందుతున్నారని తెలిపారు.

1997లో మహిళా సాధికారత కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ కమిటీ మహిళలకు సంబంధించిన అనేక సమస్యలపై 87 నివేదికలను సమర్పించిందని తెలిపారు. కమిటీ తన సిఫార్సుల ద్వారా విధానపరమైన మార్పులకు దోహదపడిందని పేర్కొన్నారు. నేడు జరుగుతున్న ఈ సమావేశం మహిళా సాధికారత కమిటీల చైర్ పర్సన్లను ఒకే వేదికపైకి తీసుకురావడం ద్వారా అనుభవాలను పంచుకోవడానికి, ఉత్తమ విధానాలను మార్పిడి చేసుకోవడానికి, సవాళ్లను పరిష్కరించడానికి సూచనలు చేయడానికి ఒక వేదికగా ఈ సదస్సు అవకాశం కల్పిస్తుందని తెలిపారు.

మధ్యాహ్న భోజన విరామ సమయంలో శాసనసభ స్పీకర్, డిప్యూటీ స్పీకర్ జిల్లా కలెక్టర్ తో కలసి భోజన ఏర్పాట్లను పరిశీలించి సదస్సుకు హాజరైన వారితో ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో వివిధ రాష్ట్రాల డెలిగేట్లు, గూడూరు, సూళ్ళురుపేట, జి.డి. నెల్లూరు, రాప్తాడు, ఆళ్లగడ్డ, కడప జిల్లాల ఎమ్మెల్యేలు, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, తిరుపతి బ్యూటిఫికేషన్ చైర్మన్ సుగుణమ్మ, రాష్ట్ర మీడియా కో ఆర్డినేటర్ శ్రీధర్ వర్మ పాల్గొన్నారు.

మహిళలకు సంస్కరణలు తెచ్చింది ఎన్టీఆర్ : అయ్యన్నపాత్రుడు

మహిళా సాధికారతకు కృషి చేసి అనేక సంస్కరణలు తీసుకొచ్చింది మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు అని శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. సినిమాల్లో హీరోగా ఉన్నప్పుడే గుండమ్మకథ సినిమాలో 'లేచింది నిద్ర లేచింది మహిళా లోకం' అంటూ మహిళ గొప్పతనాన్ని ఎలుగెత్తి చాటారన్నారు. ఆయన టిడిపి వ్యవస్థాపకుడు కావడం అదృష్టమని, ఆయన జాడల్లోనే పార్టీ నడుస్తుందన్నారు. మహిళలకు ఆస్తిలో వాటా, చదువులో రిజర్వేషన్, తిరుపతిలో పద్మావతి మహిళా యూనివర్సిటీ ఆయన చొరవేనన్నారు.

తిరుపతి వేదికగా మహిళా సాధికారత సదస్సులో ప్రతినిధులు

గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు ఘన స్వాగతం

తిరుపతిలో రెండు రోజుల పాటు జరగనున్న జాతీయ మహిళా సాధికారత సదస్సులో పల్గొనడానికి రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ ఆదివారం రేణిగుంట విమానాశ్రయానికి విచ్చేశారు. జాయింట్ కలెక్టర్ శుభంబన్సల్, అడిషనల్ ఎస్పీ రవి మనోహరాచారి, శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాష్, రేణిగుంట తహశీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి స్వాగతం పలికిన వారిలో ఉన్నారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల శ్రీవారిని లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా, రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్ నారాయణ్‌సింగ్ ఆదడివారం ఉదయం దర్శించుకున్నారు. టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు, అదనపు ఈవో సిహెచ్ వెంకయ్యచౌదరి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. రంగనాయక మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. తీర్థప్రసాదాలు, శ్రీవారి చిత్రటాన్ని అందించారుకీ కార్యక్రమంలో ఏపీ శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు, రాజ్యసభ ఎంపి సుధా నారాయణమూర్తి పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్‌లో పిజిఆర్ఎస్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

ఈనెల 15వ తేదీన సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో 15వ తేదీ సోమవారం ఉదయం 9.30గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంతో పాటు మండల, డివిజనల్ స్థాయిలో కూడా నిర్వహిస్తామని కలెక్టర్ తెలిపారు. అర్జీదారులు వారి అర్జీలు నమోదు చేసుకోవడానికి మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్ వెబ్సైట్‌లో కూడా వారి అర్జీలు నమోదు చేసుకోవచ్చునని, అలాగే నమోదైన అర్జీల గురించి వాటి స్థితి దానికి సంబంధించి ఇన్ఫర్మేషన్ ఏమన్నా తెలుసుకోవాలి అన్నప్పుడు 1100 (డబల్ వన్ డబల్ జీరో)కి నేరుగా కాల్ చేయవచ్చని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

పోలీసుశాఖలో..

చిత్తూరు జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో 'పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్' (ప్రజల ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం) 15వ తేదీ సోమవారం ఉదయం 10.30గంటలకు పాత డిపీఓ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ సమస్యలను పోలీస్ అధికారులకు నేరుగా తెలియజేసేందుకు ఈ కార్యక్రమాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు.

నగర పాలక సంస్థలో నిర్వహించే ప్రజాసమస్యల పరిష్కర వేదికను సద్వినియోగం చేసుకోవాలని నగర కమిషనర్ నరసింహప్రసాద్ కోరారు.

పిజిఆర్ఎస్ వాయిదా: కడ పీడీ

ప్రజాశక్తి- కుప్పం: కుప్పం నియోజకవర్గ ప్రజల సమస్యలు పరిష్కరించడం కోసం 15వ తేదీ సోమవారం నిర్వహించాల్సిన పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని వాయిదా వేసినట్లు కడా పీడీ వికాస్ మర్మత్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. కొన్ని అనివార్య కారణాలవల్ల ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని వాయిదా వేయడం జరిగిందని వచ్చే సోమవారం యథావిధిగా పిజిఆర్ఎస్‌ను నిర్వహించనున్నట్లు పీడీ తెలిపారు. కుప్పం నియోజకవర్గ ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

నేడు బాధ్యతలు స్వీకరించనున్న ఎస్పీ

ప్రజాశక్తి చిత్తూరుఅర్బన్

నూతన ఎస్పీగా తుషార్ డూడి సోమవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈ సందర్భంగా ఆదివారం కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ఈవో పెంచల కిషోర్ నూతన ఎస్పీకి స్వాగతం పలికి దర్శనం ఏర్పాట్లు చేసి వేద పండితులచే వేద ఆశీర్వచనం చేసి స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, చిత్తూరు డీఎస్పీ సాయినాథ్, వెస్ట్ సిఐ శ్రీధర్ నాయుడు, కాణిపాకం ఎస్సై నరసింహ పాల్గొన్నారు.



వరసిద్ధి వినాయక స్వామిన దర్శించుకున్న ఎస్పీ

ఆదమరిస్తే అంతే..!

- **పట్టించుకోని ఆర్ అండ్ బి సిబ్బంది**

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: ఆదమరిస్తే ఇక అంతే.. భారీ ప్రమాదం భారినపడక తప్పదని వాహనదారులు అంటున్నారు.. బంగారుపాళ్యం నుంచి అరగొండకు వెళ్లే రహదారిలో పురాతన వంతెన పిచ్చి మొక్కలతో పూర్తిగా కప్పబడి ఉంది. రోడ్డు భవనాల శాఖ సిబ్బంది గతంలో రహదారులకు ఇరువైపుల ఏపుగా పెరిగి ప్రయాణంకు ఇబ్బందిగా ఉన్న పిచ్చి మొక్కలను శుభ్రం చేసేందుకు సిబ్బంది నియమించి అప్పుడప్పుడు తొలగించేవారు. అయితే ప్రస్తుతం ఉన్న రోడ్డు భవనాల శాఖ సిబ్బంది ఆ పని చేపట్టక పోగా పెద్ద వంతెన కూడా ద్విచక్ర వాహనదారులకు కనబడనంతగా పిచ్చిమొక్కలు పెరిగినా పట్టించుకున్న పాపాన పోలేదు. అటుగా ప్రయాణించే వాహనదారులు ఏమాత్రం ఆదమరిచినా వంతెన పై నుండి 15 అడుగుల లోతు ఉన్న వంకలోకి జారిపడి ప్రమాదం తప్పదు. ఇకనైనా ఆర్ అండ్‌బి అధికారులు రహదారుల పర్యవేక్షణ చేపట్టి రహదారికి ఇరువైపులా పిచ్చి మొక్కలు తొలగించి రహదారిని శుభ్రం చేయాలని, దారి స్పష్టంగా కనిపించేలా చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

రోడ్డును కనిపించకుండా దట్టంగా పెరిగిన పిచ్చిమొక్కలు

బోయకొండ కార్మికులకు వేతనాలు ఇవ్వాలి

యూనియన్ గౌరవాధ్యక్షులు వాడ గంగరాజు డిమాండ్

ప్రజాశక్తి- చౌడేపల్లి: బోయకొండ దేవస్థానంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు వెంటనే వేతనాలు ఇవ్వాలని బోయకొండ గంగమ్మ దేవస్థానం కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ సిఐటియు గౌరవాధ్యక్షుడు వాడ గంగరాజు డిమాండ్ చేశారు. ఈసందర్భంగా ఆదివారం బోయకొండలో ఆయన మాట్లాడుతూ చాలీచాలని జీతాలతో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు ఇవ్వకపోవడం దారుణమన్నారు. అతి తక్కువ వేతనాలు తీసుకునే వారికి నెలనెలా 5వ తేదీ లోపు వేతనాలు ఇవ్వకపోతే వేతనాల మీద ఆధారపడిన కుటుంబాలు చాలా ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. అధికారులు రకరకాల కుంటి సాకులు పేరుతో వేతనాలు ఆలస్యం చేయడం సరికాదన్నారు. ఆదివారం బోయకొండ రద్దీగా ఉంటుందని ఆ సమయంలో కార్మికులపై భక్తులు దౌర్జన్యాలు చేస్తున్నారని కార్మికులకు రక్షణగా అధికారులు నిలబడాలని తెలిపారు. ఇప్పటికైనా బోయకొండ కార్మికులకు వేతనాలు వెంటనే ఇవ్వక పోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

17 నుండీ స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

ఈనెల 17వ తేదీ నుండీ జిల్లాలో వైద్య ఆరోగ్యశాఖ నేతృత్వంలో స్వస్త్‌నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాలు నిర్వహించన్నారు. మహిళలు, పిల్లల ఆరోగ్య సంరక్షణ సేవలను బలోపేతం చేసేలా ఈనెల 17 నుండీ వచ్చే నెల 2వ తేదీ వరకు జిల్లాలో 538 క్యాంపుల ద్వారా 50 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో, 15 పట్టణ ఆరోగ్య కేంద్రాలలో, 437 విలేజ్ హెల్త్ క్లినిక్లలో, 5 సామాజిక ఆరోగ్య కేంద్రాలలో, 3 ఏరియా హాస్పిటల్‌లో, 2 స్పెషలిస్ట్ క్యాప్స్ ద్వారా వైద్యశిబిరాలను ఏర్పాటు చేయడం జరిగింది. రెఫర్ కాబడిన వారికి స్పెషలిస్ట్ డాక్టర్లతో మహిళలు, పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. సిడి స్క్రీనింగ్, క్యాన్సర్ స్క్రీనింగ్, మాతా శిశు సంరక్షణ, వ్యాధి నిరోధక టీకాలు, రక్తహీనత స్క్రీనింగ్, టి.బి. స్క్రీనింగ్, రుతు శుభ్రత, ఏబిహెచ్‌ఏ ఐడి ప్రధాన మంత్రి జన్‌ఆరోగ్య యోజనప్రధాన మంత్రి మాతవందన యోజన పథకాలపై అవగాహన కల్పించడం జరుగుతుంది. ప్రజలందరూ ఈప్రత్యేక వైద్యశిబిరాలలో పాల్గొని ఆరోగ్య పరీక్షలు చేపించుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కోరుతోంది. జిల్లాలో నిర్వహించే క్యాంపులకు అదనపు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వెంకట ప్రసాద్ నోడల్ అధికారిగా వ్యవహరిస్తారు. డాక్టర్ హనుమంతరావు, డాక్టర్ గిరి, డాక్టర్ ప్రవీణ, డాక్టర్ అనిల్ కుమార్, డాక్టర్ అనూష పర్యవేక్షణలో నిర్వహించనున్నారు.

వీధి కుక్కల నియంత్రణకు చర్యలు

- **400ల శునకాలకు శస్త్రచికిత్స, యాంటీరేబిస్ వ్యాక్సిన్లు**

వీధి కుక్కలకు శస్త్రచికిత్సలు చేరుతున్న వైద్యులు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చిత్తూరు నగర పరిధిలో వీధి శునకాల నియంత్రణకు నగరపాలక సంస్థ, కలెక్టర్ సుమిత్ కుమార్, ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ ఆదేశాల మేరకు.. కమిషనర్ పి.నరసింహ ప్రసాద్ ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. నగరపాలక వాహనాలు షెడ్డులో ఏర్పాటు చేసిన యానిమల్ బర్త్ కంట్రోల్ (ఎబీసీ) సెంటర్‌లో వీధి శునకాలకు కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు నిర్వహిస్తున్నారు. పశు సంవర్ధక శాఖ వైద్యుల బృందం శస్త్ర చికిత్సలు చేస్తున్నారు. చికిత్సల అనంతరం శునకాలకు ఏఆర్వీ (యాంటి రేబిస్ వ్యాక్సిన్) వేసి.. మూడు రోజులపాటు ప్రత్యేక షెల్టర్‌లో ఉంచి ఆహారం అందించడం జరుగుతుంది. వాటి ఆరోగ్య పరిస్థితి మెరుగైన తర్వాత వాటిని తిరిగి యథాస్థానంలో వదిలేస్తున్నారు. 2025 ఫిబ్రవరి నుండి ఇప్పటివరకు 400 శునకాలు (190 మగ, 210 ఆడ) శాస్త్ర చికిత్సలు నిర్వహించడం జరిగిందని ఎంహెచ్వో డాక్టర్ పి.లోకేష్ తెలిపారు. నగరంలోని అన్ని వార్డుల నుంచి ప్రాధాన్యతా క్రమంలో వీధి శునకాలను పట్టి శస్త్రచికిత్సలు, యాంటి రెబిస్ వ్యాక్సిన్లు వేయిస్తున్నామన్నారు. ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందన్నారు. పిచ్చిశునకాల విషయంలోనూ వేగంగా స్పందించి చర్యలు తీసుకుంటామన్నారు. నగర ప్రజలు సహకరించాలని కోరారు.

జిల్లాలో నీటి సదుపాయల పెంపుకు కృషి

జిల్లా నీటి పారుదల శాఖ సూపరింటెండెంట్ ఆఫ్ ఇంజనీర్ వెంకటేశ్వరరాజు

ఇంటర్వ్యూ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: జిల్లాలో నీటి సదుపాయలు పెంపుకు నీటి పారుదలశాఖ కృషి చేస్తోంది. ఈ మేరకు జిల్లాలో ఉన్న రిజర్వాయర్స్, ప్రాజెక్టుల నిర్వహణ, చెరువులు, చెక్ డ్యాంకుల పర్యవేక్షణ వర్షాకాలంలో అధిక వర్షాల సమయంలో ప్రజలను అప్రమత్తం చేయడంతో పాటు సప్లైయ్ ఛానల్స్ ద్వారా చెరువులకు నీరుపారేలా జాగ్రత్తలు తీసుకోవడంతోపాటు ప్రాజెక్టులు, రిజర్వాయర్స్‌లో నీటి నిల్వలు ఎప్పటికప్పుడు అంచనా వేయడం ప్రధానంగా ఉంటాయి. చిత్తూరు జిల్లాలో నదులు లేకపోవడంతో చెరువులు, బోరు బావుల కింద వ్యవసాయం సాగుతోందని చిత్తూరు జిల్లా నీటిపారుదలశాఖ సూపరిండెంట్ ఆఫ్ ఇంజనీర్ వెంకటేశ్వరరాజు తెలిపారు. ప్రజాశక్తి ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడారు.

ప్రజాశక్తి: ఇటీవల కురిసిన వర్షాలకు జిల్లాలోని చెరువులు నిండాయా?

ఎస్ఈ: జిల్లాలో ఇటీవల కురిసిన వర్షాలకు చెరువుల్లో నీటి మట్టం పెరిగినా నిండి ఓవర్‌ఫ్లో అనేది లేదు. ప్రాజెక్టులు, రిజర్వాయర్స్‌లో కూడా కాస్తా నీటి మట్టం పెరిగింది.

ప్రజాశక్తి: కుప్పానికి కృష్ణాజలాల రావడంపై స్పందన.?

ఎస్ఈ: కుప్పానికి కృష్ణాజలాలు అందించేందుకు 2014లో పునాదిపడింది. ఇటీవల కృష్ణాజలాలకు 12వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. దాదాపు మైనర్, మేజర్ 431 చెరువులకు నీటిని నింపడం జరుగుతుంది. కుప్పం పరిధిలో కెబిసి కెనాల్ ద్వారా 64 కిలోమీటర్లు నీరుపారుతుంది. గ్రౌండ్ వాటర్ పెరుగుతుంది.

ప్రజాశక్తి: చెరువుల అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.?

ఎస్ఈ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ రకాల పథకాల ద్వారా జిల్లాలోని మేజర్, మైనర్ చెరువుల అభివృద్ధికి కృషి చేయడం జరుగుతోంది. చెరువుల సప్లైయ్ ఛానల్స్ బాగుచేయడం జరుగుతోంది.

ప్రజాశక్తి : చిత్తూరు జిల్లాలో అభివృద్ధి పనులు..?

ఎస్ఈ: చిత్తూరు జిల్లాలో 1,428 .75 లక్షలతో రూపొందించిన వివిధ పనుల్లో దాదాపు పూర్తి చేయడం జరిగింది. కొన్ని పురోగతిలో ఉన్నాయి. 2,744.80 ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ జరుగుతుంది.

రూ.8లు ఇవ్వాల్సిందే..!

- **నేడు కలెక్టరేట్ ఎదుట మామిడి రైతుల నిరసన**

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ప్రభుత్వం ప్రకటించిన విధంగా ఫ్యాక్టరీలకు సరఫరా చేసిన మామిడికి రూ.8లు ఇవ్వాల్సిందే అంటూ మామిడి రైతుల సంక్షేమ సంఘం, రైతుల సంఘాల నేతృత్వంలో ప్రభుత్వాన్ని ప్రశ్నించేందుకు ఐక్యంగా కదం తొక్కనున్నారు. సీజన్ ప్రారంభ సమయంలో జ్యూస్‌ఫ్యాక్టరీల యజమాన్యంతో చర్చలు జరిపిన ప్రభుత్వ అధికారులు ఫ్యాక్టరీ యజమానులను ఒప్పించి తోతాపూరి మామిడి కిలోకు రూ.8లు ఇచ్చేలా మాట్లాడామని గొప్పలు చెప్పుకున్నారు. జ్యూస్ ఎగుమతులు ఆగిపోవడం, ఫ్యాక్టరీ నష్టాలు, పంట దిగుబడి పెరగడం వంటి కారణాలతో రైతులు కూడా ఆ ధరను ఒప్పుకోక తప్పలేదు. ప్రభుత్వ సబ్సిడీ నాలుగు రూపాయలు, ఫ్యాక్టరీలిచ్చే రూ.8లు కలిపితే కిలోకు రూ.12లు వస్తాయని రైతులు ఆశించారు. తీరా మామిడి సీజన్ ముగిసిన తరువాత ఫ్యాక్టరీ నిర్వహకులు రైతులను ధగా చేస్తూ రూ.4,5లు ఇస్తుండటంతో అన్యాయం చేశారంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మామిడిని అమ్మడానికి రైతుల పడిగాపులు (ఫైల్)

ప్రభుత్వంతో తాడోపేడు తేచ్చుకొనేందుకు సోమవారం ఛలో కలెక్టరేట్‌కు సిద్ధం అవుతున్నారు. చిత్తూరు జిల్లాలో ఈ ఏడాది 37వేల మంది మామిడి రైతులు తాము కష్టించి పండిన మామిడి 4.10 లక్షల టన్నులు ఫ్యాక్టరీలు, ర్యాంపులు, మార్కెట్ యార్డులకు సరఫరా చేశారు. ప్రభుత్వ హామీ మేరకు సబ్సిడీ రూ.1.60కోట్లు ఇస్తామని ప్రకటించినప్పటికీ ఫ్యాక్టరీలు మాత్రం ప్రభుత్వ నిర్ణయం మేరకు చెల్లించకుండా ఏవో కుంటిసాకులు చెబుతూ తక్కువ చెల్లించి చేతులు దులుపుకోవాలని చూస్తున్నాయంటూ మామిడి రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రైతులకు రూ.8లు చెల్లించి జ్యూస్ ఫ్యాక్టరీలు ప్రాసెస్ చేస్తే 50 నుంచి 80 శాతం లాభం వచ్చే అవకాశముంది. అదే రూ.5లు మామిడి రైతులకు చెల్లిస్తే వందశాతం లాభం వచ్చే అవకాశముంది. మామిడి రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి ఉంటుంది. ఇప్పటికే జిల్లాలోని కొన్ని ఈ సీజన్ కష్టాలను జీర్ణించుకోలేక మామిడి రైతులు చెట్లు నరికేస్తున్న పరిస్థితి. ఈ పరిస్థితి నుండీ మామిడి రైతును కాపాడుకుని చిత్తూరు మామిడి ఖ్యాతిని నిలబెట్టుకోవాలంటే రూ.8లు ఇచ్చి తీరాల్సిందేనని అంటున్నారు.

ధర లేక రోడ్డుపక్కన పారబోసిన మామిడి కాయలు (ఫైల్ ఫొటో)

వెదురారణ్యం.. సుందరవనం

- **అన్ని హంగులతో నగరవనం**
- **12.5 ఎకరాల విస్తీర్ణంలో**
- **ఆహ్లాదకర వాతావరణం**
- **ఎమ్మెల్యే గురజాల చొరవతో పార్కు ఏర్పాటు**

ప్రజాశక్తి- చిత్తూరు (యాదమరి)

వనసంపదను భావితరాలకు అందించడానికి, నగరవాసులకు అడవుల ప్రాధాన్యం తెలుపుతూ వాటి అభివృద్ధిలో భాగస్వామ్యం చేయడంలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నగరవనాలు ఏర్పాటు చేస్తున్నాయి. చిత్తూరు నగరపాలక సంస్థ పరిధిలో జిల్లా కలెక్టర్ కార్యాలయ సమీపంలో అటవీ శాఖకు చెందిన 12.50 ఎకరాల విస్తీర్ణంలో వెదురారణ్యం పేరుతో సుందరవనాన్ని చిత్తూరు పట్టణ ప్రజలకు సౌకర్యవంతంగా ఏర్పాటు చేశారు. ఈ పార్కును చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ ఇటీవల ప్రారంభించి నగరప్రజలకు అందుబాటులోకి తెచ్చారు.

చిత్తూరు పట్టణ ప్రజలకు ఉదయం, సాయంత్రం సేద తీరేందుకు సౌకర్యవంతంగా అనువైన ప్రదేశాలు అందుబాటులో లేకపోవడంతో చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ పట్టుబట్టి వెదురారణ్యం పార్కును అభివృద్ధి చేసి ప్రజలకు సౌకర్యవంతంగా అందుబాటులో ఉండేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపారు, పార్కు పనులు వేగవంతం చేయించారు. పిల్లలకు, పెద్దలు పని ఒత్తిడి, బిజీబిజీ జీవాతాల నుంచి సేదతీరేలా ప్రకృతివనం ఎంతో ఉపయోగకరంగా అభివృద్ధి చేయనున్నారు.

జిల్లా కలెక్టర్ కార్యాలయం సమీపంలో ఉంది. కలెక్టర్ కార్యానికి నిత్యం వందలాదిమంది సందర్శకులు వస్తుంటారు. ఇక్కడ దాదాపు అన్ని పరిస్థితులు నగరానికి అనుకూలంగానే ఉన్నాయి. నగరవాసులకే కాకుండా చిత్తూరు, బెంగళూరు, చెన్నై రాష్ట్రాల సరిహద్దు కావడంతో ఇక్కడ ఇతర ప్రాంతాల నుంచి వచ్చే యాత్రికులకు సందర్శకులకు కూడా ఈ పార్కు అనుకూలమైన ప్రదేశం.

చిత్తూరు రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలో 12.5 ఎకరాల విస్తీర్ణంలో అక్కడున్న ప్రతికూల పరిస్థితులను చూపిస్తూ అటవీ శాఖ నగరవనం కోసం స్థలాన్ని ఎంపిక చేసి మరింత నిధులతో పూర్తిస్థాయిలో నగరవనాన్ని తీర్చిదిద్దేందుకు అటవీశాఖ అధికారులు కసరత్తు ప్రారంభించారు. ప్రస్తుతం మొదటి దశ పనులు పూర్తి చేశారు. రెండవ దశ పనులు పూర్తి చేయాల్సి ఉంది. ఈ పనులను వీలైనంత త్వరగా పూర్తి చేసేందుకు కసరత్తు ప్రారంభించారు.

2.5 ఎకరాల విస్తీర్ణం ఏర్పాటు చేసిన నగరవనం పార్క్, వెదురుతో చేసిన ఆడిటోరియం

మరిన్ని అభివృద్ధి పనులు

చిత్తూరు నగర ప్రజలకు అటవీ శాఖ పరిధిలో ఏర్పాటు చేసిన విధులు అరణ్యం వనంలో అవుట్ డోర్ యోగ కేంద్రాన్ని, అవుట్ డోర్ ఆడిటోరియం నిర్మాణ పనులు చేపట్టాల్సి ఉంది. అర ఎకరా విస్తీర్ణంలో వివిధ రకాలైన పూల తోటల పెంపకం చేపట్టనున్నారు. 12.5 ఎకరాల విస్తీర్ణంలో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టి వనాన్ని మరింత అభివృద్ధి చేయనున్నారు.

అందుబాటులో ఉన్న వసతులు...

ఉద్యానవనం ప్రవేశద్వారం ఆర్చ్‌ను మరింత అందంగా తీర్చిదిద్దారు. ఇప్పటికే ప్రజలకు అందుబాటులో నగరవనం లోపల వాకింగ్ ట్రాక్, అడ్వెంచర్ పార్క్, జిప్ లైన్, రోప్‌వే ఆక్టివిటీ, అవుట్డోర్ జిమ్, చిన్నపిల్లలకు ఆటస్థలం, వెదురు బొంగులతో ఆడిటోరియం వంటివి పిల్లలకు అందుబాటులో ఉన్నాయి. ప్రతిరోజు ఉదయం 9 నుండి సాయంత్రం 6 గంటల వరకు ఈ పార్కును తెరిచి ఉంచుతున్నారు. సందర్శన రుసుంను చిన్నపిల్లలకు ప్రస్తుతం రూ.10, పెద్దలకు రూ.20లు నిర్ణయించారు.

- చిన్నపిల్లలు ఆడుకోవడానికి ఏర్పాటు చేసిన ఆటస్థలం – రోప్‌వే

గాలివానకు కూలిన ఇల్లు

ప్రజాశక్తి- చౌడేపల్లి: గాలివాన కారణంగా ఓ ఇల్లు కూలింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. బాధితుని కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని పరికతన పంచాయతీ మడుకూరుకు చెందిన మునుస్వామి కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. గ్రామంలో అతనికి ఒక ఇల్లు ఉంది. గత రెండు రోజులుగా కురుస్తున్న వానకు మునుస్వామి ఇల్లు నేలమట్టమైంది. ఒకవైపు మాత్రమే గోడ కూలి పడిపోయింది. ఆ సమయంలో ఎవరు ఇంట్లో లేకపోవడం వల్ల ఎలాంటి నష్టం జరగలేదు. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఇల్లును కోల్పోయిన బాధితునికి ప్రభుత్వం న్యాయం చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఏనుగుల దాడి

ప్రజాశక్తి - రొంపిచర్ల: పులిచెర్ల మండలం కల్లూరు సమీపంలోని బోడిరెడ్డిగారిపల్లి గ్రామం చల్లావారిపల్లి పరిసరాలలో అడవులలో నుంచి ఏనుగులు ఆదివారం వేకువజామున రైతులకు చెందిన పంటలపై దాడి చేయడంతో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. చల్లావారిపల్లి గ్రామ రైతులు మధుసూదన్ నాయుడు, గురు ప్రసాద్, విజయ్ కుమార్, బాలసుబ్రమణ్యం తదితర రైతులకు చెందిన టమోటా పంటలు తొక్కి నాశనం చేశాయి. అల్లనేరేడు, కొబ్బరి చెట్లను విరిచి ధ్వంసం చేశాయి. పంటలకు ఏర్పాటు చేసుకున్న కంచె, రాత్రి కూసాలను విరిచేశాయి. పులిచెర్ల మండల పరిసరాలలో ప్రతిరోజు ఏదో ఒకచోట ఏనుగుల దాడి వలన రైతులకు నష్టం వాటిల్లుతూనే ఉంది. నష్టపోయిన రైతులకు ప్రభుత్వం తక్షణం నష్టపరిహారం అందించాలని, ఏనుగుల దాడులను నియంత్రించాణి రైతులు వేడుకుంటున్నారు.

ఊరి నాయనపల్లిలో నీటి సమస్య

ప్రజాశక్తి- కుప్పం: కుప్పం మండలం గుడ్ల నాయనపల్లి పంచాయతీ ఊరి నాయనపల్లి ఎస్సీ కాలనీలో నీళ్ల కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎస్సీ కాలనీలో మంచినీటి సమస్య తలెత్తిన ఏ ఒక్కరు పట్టించుకోలేదని నీళ్ల కోసం వ్యవసాయ బావులు, చెరువు వద్దకు పరుగులు తీయాల్సిన దుస్థితి నెలకొందంటూ మహిళలు వాపోయారు. గ్రామంలో నెలకొన్న నీటి సమస్యలు వెంటనే పరిష్కరించాలంటూ మహిళలు విజ్ఞప్తి చేశారు.

వృద్ధులకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి - కార్వేటినగరం: మండల కేంద్రం కార్వేటినగరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సబ్ రిజిస్ట్రార్‌గా విధులు నిర్వహిస్తున్న సత్యప్రసాద్, ఆయన సతీమణి కోమల, కుమారుడు సుధీర్ కుమార్ ఆదివారం రాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృద్ధాశ్రమంలోని వృద్ధులకు అన్నదానంతో పాటు, చీరలు, పంచెలు వితరణ చేశారు. ఈ సందర్భంగా సబ్ రిజిస్ట్రార్ సత్యప్రసాద్ మాట్లాడుతూ తమ వంశంలో మృతి చెందిన వారి జ్ఞాపకార్థం ప్రతి ఏడాది వృద్ధులకు, అనాధులకు వస్త్రాలు వితరణ చేయడం ఆనవాయితీ అన్నారు. ప్రతి ఒక్కరూ తల్లిదండ్రులను, వృద్ధులను గౌరవించాలని సూచించారు. రాస్ కోఆర్డినేటర్ ప్రకాష్, వృద్ధులు పాల్గొన్నారు.

అరచేతిలో.. అన్ని సేవలు

- **కొత్త పుంతలు తొక్కుతున్న పరిజ్ఞానం**

ప్రజాశక్తి- పూతలపట్టు: సాంకేతిక పరిజ్ఞానం కొత్త పుంతలు తొక్కుతోంది. కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పనిలేకుండా పౌరసేవలు సులభతరం అవుతున్నాయి. ఆండ్రాయిడ్ ఫోన్ అంతర్జాల సదుపాయం ఉంటే చాలు.. ఇంటి నుంచే సేవలు పొందవచ్చు. ఆయా సేవాలకు సంబంధించి యాప్‌లను డౌన్లోడ్ చేసుకొని లాగిన్ అయితే చాలు ఏ యాప్ ఏ సేవకు ఉపయోగపడుతుందో చూద్దాం...

భద్రతకు డిజి లాకర్

ముఖ్యమైన పత్రాలను డిజిటల్ రూపంలో దాచుకోవచ్చు. విద్యార్థులు విద్యార్హత ధ్రువపత్రాలు, క్యాన్సిగేషన్, కుల, ఆదాయ, ధ్రువపత్రాలు డీజీ లాకర్లో భద్రపరుచుకోవచ్చు. వాటితోపాటు వాహన రిజిస్ట్రేషన్ పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్, ఆధార్, పాన్ కార్డ్, పాస్పోర్ట్ దాసుకోవచ్చు. ఇతర ప్రాంతాలకు వెళ్లినప్పుడు ఏ సర్టిఫికెట్ అవసరమో ఈ యాప్‌లోకి వెళ్లి సులభంగా డౌన్లోడ్ చేసుకోవచ్చు.

ఎం. ఆధార్

ప్రస్తుతం ఆధార్ కార్డు లేకుండా ఏ పని జరగడం లేదు. ఎం. ఆధార్ యాప్ ద్వారా ఆధార్ కార్డుకు సంబంధించిన అన్ని సేవలు పొందవచ్చు. ఈ యాప్ ద్వారా ఆధార్ కార్డును డౌన్లోడ్ చేసుకోవచ్చు. చిరునామాలు, మార్పులు ఉంటే చేసుకోవచ్చు. పివిసి కార్డు కావాలనుకుంటే బుక్ చేసుకోవచ్చు. ఆధార్ వివరాలు దుర్వినియోగం కాకుండా ఐరిస్, వేలి ముద్రలను డిజేబుల్ ఎనేబుల్ చేసుకోవచ్చు.

నెక్స్ట్ జెన్ ఎం పరివాహన్

ఈ యాప్ ను జాతీయ సమాచార కేంద్రం అందుబాటులోకి తీసుకొచ్చింది. రిజిస్టర్ అయిన వాహనాల వివరాలు ఈ యాప్ ద్వారా తెలుసుకోవచ్చు. వాహన రిజిస్ట్రేషన్లు వాహనాల సుంకం చెల్లింపులు రవాణాకు సంబంధించి వివిధ రకాల సేవలు వివరాలను తెలుసుకోవచ్చు. డ్రైవింగ్ లైసెన్సులు వాహనాల రిజిస్ట్రేషన్ పత్రాల తదితర డిజిటల్ కాపీలను డౌన్లోడ్ చేసుకోవచ్చు.

ఉమంగ్ యాప్

ప్రభుత్వ సేవలు అన్ని ఒకే చోట అందేలా ఉమంగ్ యాప్ ఉపయోగపడుతుంది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సేవలు ఇందులో తెలుసుకోవచ్చు. ఆధార్ డీజి లాకర్ ఈఎస్ఐ విద్యార్థులకు సంబంధించిన ధూపత్రాల సేవలు ఈ యాప్ ద్వారా పొందవచ్చు.

ఎం -పాస్పోర్ట్

ఈ యాప్ ద్వారా పాస్పోర్టు సేవలు పొందవచ్చు కొత్త పాస్పోర్ట్ కోసం దరఖాస్తు.. స్లాట్ బుకింగ్ చేసుకోవచ్చు రుసుం చెల్లించవచ్చు. ఇందుకు అవసరమైన పత్రాలు అప్లోడ్ చేయడంతో పాటు పాస్పోర్ట్ స్టేటస్ తెలుసుకోవచ్చు.

అవగాహన మరింత అవసరం..

ప్రభుత్వం వివిధ యాపల ద్వారా ప్రజలు సేవలు పొందే అవకాశాన్ని కల్పించడం హర్షనీయం. కానీ చాలావరకు ప్రజలకు ఈ యాప్‌లపై అవగాహన లేదు. ప్రభుత్వం ఈ సేవలపై మరింత అవగాహన కల్పించాల్సి ఉందని ప్రజలు కోరుతున్నారు.

మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి- విజయపురం (నగరి): పట్టణ పరిధి ఏజేఎస్ కళ్యాణ మండపంలో శ్రీకృష్ణ యాదవ సేవాకమిటీ వారు నిర్వహించిన మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. అన్నాగౌరీ ఆస్పత్రి వారి సహకారంతో నిర్వహించిన ఈ శిబిరంలో ఉచితంగా షుగర్, బీపీ, కొలెస్ట్రాల్, హిమోగ్లోబిన్, బ్లడ్ గ్రూపు పరీక్షలు నిర్వహించారు. వాటికి అనుగుణంగా మందులు పంపిణీ చేశారు. 225 మంది ఈశిబిరంలో పాల్గొని వైద్యసేవలు అందుకున్నట్లు ఆస్పత్రి వర్గాలు తెలిపారు. ఈ శిబిరాన్ని యాదవ సంఘ నేతలు రామలింగం, జయరామ్, నరేష్, వరదరాజులు, దొరస్వామి, వెంకటేశ్, ధన, ఎంఎం వెంకటేశులు, రామాంజులు, గోపాల్ పర్యవేక్షించారు.

నిరంజన్ కుమార్ మృతికి నివాళి

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం: మండలంలోని సింధు రాజపురం గ్రామానికి చెందిన దశరథ నాయుడు కుమారుడు నిరంజన్ కుమార్ చౌదరి ఇటీవల బెంగళూరులో రోడ్డు ప్రమాదంలో మరణించారు. ఆయన 7 మందికి అవయవం చేశారు. ఆదివారం నిరంజన్ కుమార్ చౌదరి కర్మ క్రియలకు టిడిపి మండల పార్టీ అధ్యక్షులు గంధమనేని జయశంకర్ నాయుడు హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. ఆయన వెంట సింగల్ విండో చైర్మన్ నిరంజన్ రెడ్డి, జీవన్ రెడ్డి, మాధవరెడ్డి, ఢిల్లీ ఉన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం..

మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

ప్రజాశక్తి -ఎస్ఆర్ పురం: కార్యకర్తలకు అండగా ఉంటామని, కార్యకర్తల శ్రేయస్సు పార్టీ అభివృద్ధికి నాంది అని పునాది అని మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి అన్నారు. ఆదివారం చిత్తూరు వైఎస్ఆర్సిపి సమన్వయకర్త ఎంసి.విజయానంద రెడ్డితో కలిసి మండలంలోని బసిరెడ్డిపల్లి గ్రామంలో వైఎస్ఆర్సిపి నాయకుడు సాక్షి ఎడివిటి మేనేజర్ వెంకటరత్నం తండ్రి నరసింహులు నాయుడు కర్మక్రియల కార్యక్రమంలో పాల్గొన్నారు. నరసింహనాయుడు చిత్రపటానికి పూలు వేసి నివాళు లర్పించారు. కొత్తపల్లి చిత్తూరు పార్లమెంట్ కార్యదర్శి విజయబాబు, కుప్పయ్య, జనార్దన్, తయూరు సర్పంచ్ వరదమ్మ, మార్కెటింగ్ కమిటీ మాజీ డైరెక్టర్ గోవిందరెడ్డి, కోటిబాబు సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

మండలాన్ని తిరుపతి జిల్లాలో కలపాలి

అఖిలపక్ష సమావేశం నాయకుల డిమాండ్

ప్రజాశక్తి- కార్వేటినగరం: కార్వేటినగరం మండలాన్ని తిరుపతి జిల్లాలో చేర్చాలని అఖిలపక్ష సమావేశం నిర్వహించడం జరిగింది. అఖిలపక్ష నాయకులు మాట్లాడుతూ ఎన్నో దశాబ్దాలుగా కార్వేటినగరం మండలం ప్రజలు తిరుపతిపై ఆధారపడి ఉందని, కార్వేటినగరం మండలాన్ని తిరుపతి జిల్లాలో చేర్చాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లడం జరిగిదని ఆయన సానుకూలంగా స్పందిస్తూ కార్వేటినగరానే కాకుండా వెదురు మండలాన్ని కూడా తిరుపతి జిల్లాల్లో చేరుస్తామని హామీ ఇచ్చారని, ఇచ్చిన హామీ ప్రకారమే వెదురుకుప్పం మండలాన్ని తిరుపతి జిల్లాలో చేర్చే విధంగా పనులు చేపట్టడం జరిగిందని, కార్వేటినగరాన్ని తిరుపతి జిల్లాల్లో చేర్చే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గౌతమ్ రాజు, టిడిపి పట్టణ అధ్యక్షులు జగన్నాథం, ఉపాధ్యాయ సంఘ నాయకులు పాల్గొన్నారు.

మండలాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేస్తాం: ఎమ్మెల్యే

ప్రజాశక్తి- వీ కోట: మండల పరిధిలోని పురాతన ఆలయాలను అనుసంధానం చేస్తూ వి కోట మండలాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని పలమనేరు ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి తెలిపారు. మండలంలోని నాయకనేరి అటవీ ప్రాంతంలోగల పురాతన శ్రీసుబ్రహ్మణ్యస్వామి, చౌడేశ్వరి దేవి ఆలయాల్లో ఆదివారం ఘనంగా ఉత్సవాలు నిర్వహించారు. ఈ ఉత్సవాలకు పలమనేరు శాసనసభ్యులు అమరనాథ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మొదట శ్రీ సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో జరిగిన పూజా కార్యక్రమాలలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. సుందర అటవీ ప్రాంతంలో ఆహ్లాదకరమైన వాతావరణంలో ఈ ఆలయం నెలకొని ఉండడం గొప్ప విషయంగా ఆయన పేర్కొన్నారు. అక్కడ పురాతన కట్టడాలను పరిశీలించి ఆలయాన్ని అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. అనంతరం అక్కడికి సమీపంలోని చౌడేశ్వరి దేవి ఆలయంలో ఏడాదికోమారు నిర్వహించే ఉత్సవ పూజలలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రెండు ఆలయాల ప్రాశస్త్యాన్ని ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు వివరించారు. అదేవిధంగా ఆలయ మర్యాదలతో సత్కరించి వారికి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు, టిడిపి నాయకులు రామచంద్ర నాయుడు, రంగనాథ్, రాంబాబు, ఈశ్వర్ గౌడ్, సోమశేఖర్, ధీరజ్, శబరీష్, విశ్వనాథ్, భక్త, ఉదయ్, సతీష్, చందు పాల్గొన్నారు.

మండలాభివృద్ధి పై చర్చిస్తున్న ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి

వరసిద్ధుని సేవలో పార్లమెంటరీ పద్దుల కమిటీ ఛైర్మన్

ప్రజాశక్తి- ఐరాల: శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారిని పార్లమెంటరీ పద్దుల కమిటీ ఛైర్మన్ శ్రీలక్ష్మీకాంత్ బాజ్పాయ్, సభ్యులు ఆదివారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ ఏఈఓ రవీంద్రబాబు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేసి స్వామివారి తీర్థప్రసాదాలు శేషవస్త్రం చిత్రపటాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ వాసు, టెంపుల్ ఇన్స్పెక్టర్ చిట్టిబాబు, యూనియన్ బ్యాంక్ మేనేజర్ నవీన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ఘనసన్మానం

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి

మండలంలోని నెల్లిపట్ల క్లస్టర్‌కు సంబంధించిన 30 మంది ఉపాధ్యాయులు వివిధ ప్రాంతాలకు బదిలీపై వెళ్ళగా వారిని మండల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఎంపీపీ ఎస్ చెప్పిడిపల్లి ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ తల్లి, తండ్రి తర్వాత గురువులైన తమకే ప్రాధాన్యత ఎక్కువగా ఉన్నదని, విద్యార్థులు తల్లితండ్రుల కన్నా ఎక్కువ సమయం తమతోనే ఉంటారని, వారిని తమ పిల్లల కన్నా ఎక్కువగా అభిమానించి గౌరవించి సంఘంలో ఒక మంచి పౌరుడిగా ఉండే విధంగా తర్ఫీదు ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. వారికి విద్య బుద్ధులు చెప్పడంలో శాయశక్తుల ప్రయత్నిస్తున్నామని, వారి భవిష్యత్తుకు బాటలు వేయడానికి తమ వంతు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంఈఓలు వేణుగోపాల్ రెడ్డి, సుబ్రహ్మణ్యం, ప్రధానోపాధ్యాయురాలు శాంతిశ్రీ, నెల్లిపట్ల క్లస్టర్ ఉపాధ్యాయులు లక్ష్మీదేవి, అశ్వత్తా, చంద్రమోహన్, సుధాకర్, భరత్ మోహన్, వెంకటరమణ, సిఆర్పి వెంకటేశు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ట్రై సైకిల్ పంపిణీ

ప్రజాశక్తి -కుప్పం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దివ్యాంగులకు అన్ని విధాలుగా అండగా ఉంటుందని రెస్కో ఛైర్మన్ ప్రతాప్, టిడిపి మున్సిపల్ పార్టీ అధ్యక్షులు రాజ్ కుమార్ పేర్కొన్నారు. కుప్పం టిడిపి కార్యాలయంలో దివ్యాంగులకు ట్రై సైకిళ్లు, హియరింగ్ మిషన్‌లతోపాటు ఇతర పరికరాలను పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వ హయాంలో ప్రతి ఒక్కరికి లబ్ధి చేకూర్చాలని లక్ష్యంతో సీఎం చంద్రబాబు ముందుకు సాగుతున్నారని కుప్పంలో దివ్యాంగులకు అవసరమైన పరికరాలను పంపిణీ చేయడం ఎంతో సంతోషంగా ఉందని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో రెస్కో ఛైర్మన్ ప్రతాప్, మున్సిపల్ ఛైర్మన్ సెల్వరాజ్, కడా అడ్వైజర్ కమిటీ వెంకటేష్, క్లస్టర్ ఇంచార్జ్ కన్నన్, కౌన్సిలర్ జిమ్ దాము, క్లస్టర్ శ్యాంప్రసాద్, ఎస్కో డైరెక్టర్ శివ, మహిళ నేతలు శారదమ్మ పాల్గొన్నారు.

బాధ్యతగా పనిచేస్తాం: ప్రేమ్ కుమార్

ప్రజాశక్తి- కుప్పం: సీఎం చంద్రబాబు నాయుడు ఎలాంటి బాధ్యత ఇచ్చిన కష్టపడి పనిచేస్తామని టిడిపి కుప్పం మండల అధ్యక్షులు ప్రేమ్ కుమార్ పేర్కొన్నారు. ఏపీఐఐసీ డైరెక్టర్‌గా ప్రేమ్ కుమార్‌ను నియమించడంతో ఆదివారం కుప్పం టిడిపి కార్యాలయంలో టిడిపి శ్రేణులు ఆయనను ఘనంగా సత్కరించారు. ఎలాంటి పదవులు ఆశించకుండా పార్టీ కోసం కష్టపడి పనిచేస్తే తప్పక గుర్తింపు లభిస్తుందని పార్టీ శ్రేణులు కలిసికట్టుగా ముందుకు సాగాలని ప్రేమ్‌కుమార్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధ్యక్షుడు రాజ్ కుమార్, మున్సిపల్ ఛైర్మన్ సెల్వరాజ్, చెక్కునాత్తం మణి, రెస్కో డైరెక్టర్లు శివ, మురళి, సర్పంచ్ సంతోష్ పాల్గొన్నారు.

ఎన్నికల హామీ నెరవేర్చండి: ఏఐటీయూసీ

ప్రజాశక్తి- విజయపురం (నగరి) : ఎన్నికలో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నెరవేర్చాలంటూ ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య డిమాండ్ చేశారు. ఆదివారం సీపీఐ కార్యాలయంలో పార్టీ యువజన సంఘం నాయకులు నేతాజీ, మహేంద్ర నాథ్ అధ్యక్షతన నిర్వహించిన యువజన సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలో భాగంగా నిరుద్యోగులకు ప్రతినెల నిరుద్యోగ భృతి రూ.3000 ఇస్తామని పేర్కొందని, పలు పరిశ్రమలు తెచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామంటూ హామీ ఇచ్చిందన్నారు. అయితే పాలన 15 నెలలు దాటినా ఇప్పటి వరకు ప్రభుత్వం వీటి ఊసే ఎత్తలేదన్నారు. ఇకనైనా ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాన్ని అమలు చేయాలని కోరారు. హామీలు నెరవేర్చేవరకు యువతతో కలిసి పోరాటం కొనసాగిస్తామన్నారు.సీనియర్ నాయకులు వేలన్, నాయకులు బాషా, యేసయ్య, ముత్తు, నరేష్, వేణుగోపాల్, సురేష్, కుమరేసన్ తదితరులు పాల్గొన్నారు.

సర్వోత్తమ రావు జయంతి వేడుకలు

ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరు ప్రభుత్వ శాఖా గ్రంథాలయంలో గాడిచర్ల హరి సర్వోత్తమరావు జయంతి వేడుకలను ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలోపాల్గొన్న పలువురు రచయితలు సర్వోత్తమ రావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలని, గ్రంథాలయ ఉద్యమ పితామహులు గాడిచర్ల హరిసరోత్తమరావు సేవలు మరిచిపోలేనివని కొనియాడారు. గ్రంథాలయాల స్థాపనకు విస్తరణకు అభివృద్ధికి ఆయన విశేషంగా కృషిచేశారని, స్వాతంత్ర్య సమర యోధులుగా, ఉత్తమ పత్రికా సంపాదకులుగా, గ్రంథాలయ పితామహులుగా గాడిచర్ల హరి సర్వోత్తమరావు సమాజానికి సేవ చేశారని అన్నారు. కార్యక్రమంలో రచయితలు సి.బాలకృష్ణమూర్తి, దోర్నాదుల సిద్ధార్థ, గ్రంథాలయ అధికారి హేమ కుమార్, తొండవాని గోపీనాథ్, శ్రీపురం సీతారామయ్య, మల్లిచెట్ల దేవేంద్ర, నందగోపాల్, తొండవాని సురేంద్రనాథ్ పాల్గొన్నారు.

నాణ్యమైన టైర్స్‌కు చిరునామా కాంటినెంటల్ టైర్స్

ప్రజాశక్తి- తిరుపతి సిటీ: వాణిజ్యం పరంగా దినదినాభివృద్ధి చెందుతున్న తిరుపతి నగరంలో అన్ని రకాల వాహనాలు నాణ్యమైన టైర్స్‌కు కాంటినెంటల్ టైర్స్ చిరునామాగా నిలుస్తోందని ఆ షోరూమ్ యాజమాని పి.గిరి తెలిపారు. స్థానిక రేణిగుంట రోడ్డులోని ఆటోనగర్‌లో ఆ షోరూమ్ వద్ద ఆయన 'ప్రజాశక్తి'తో మాట్లాడుతూ 40 సంవత్సరాలుగా వ్యాపారరంగంలో వినియోగదారులకు నాణ్యమైన సేవలందిస్తూ, వారి మన్నలను పొందాం. మా ప్రయాణం 1985లో ప్రారంభమైందని, మా నాన్న ఎలుమలై నాణ్యమైన సేవ, నమ్మకం అనే పునాదిపై నిర్మించిన సెకండ్ హ్యాండ్ టైర్ దుకాణాన్ని ప్రారంభించాం. అప్పటి నుంచి వినియోగదారుల నమ్మకాన్ని చురగొని, అంచెలంచెలుగా ఎదుగుతూ నూతన టైర్ల షోరూమ్స్‌ను తిరుపతి నగరంలో రెండు బ్రాంచిలు ఏర్పాటు చేసి, వినియోగదారులకు మరింత దగ్గరయ్యాము. 2016లో మరింత మెరుగైన సేవలందించేందుకు అప్‌గ్రేడ్ చేసిన ఆపర్లు, మెరుగైన సౌర్యాలతో కొత్త టైర్ స్టోర్ (సూపర్‌టైర్స్)ను ప్రారంభించాము. నేడు వినియోగదారులకు లెగసీ, ట్రస్ట్, ఆధునిక శ్రేష్టతను మిళితం చేస్తూ, ప్రమియర్ టైర్ సర్వీస్ అనుభవాన్ని అందిస్తుండడం తమకు గర్వకారణం అన్నారు. ప్రయోగత్మాక ప్రయోగశాల తారక్సా గమ్ ల్యాబ్ అంక్లమ్ 2018లో మెక్లెన్- బర్గ్ వర్పోమర్న్ జర్మనీలో ప్రారంభించబడింది. ఈ ప్రయోగశాల రష్యన్ డాండెలీ- ఆన్‌ల పెంపకం, ప్రాసెసింగ్‌పై సంచలనాత్మక పరిశోధనలను నిర్వహిస్తున్నాం. ఇది రబ్బరు చెట్టుకు ముడిసరుకు ప్రత్యామ్నాయ వనరుగా ఉంది. ఇది పర్యావరణ అనుకూల టైర్ ఉత్పత్తిలో ఒక పెద్ద ముందడుగని పేర్కొన్నారు. కాంటినెంటల్ సెల్ మా టైర్ నైపుణ్యం. గ్రామీణ ఇంజనీరింగ్‌లో 150 సంవత్సరాల విశ్వాసాన్ని కల్గి ఉందని, అలాంటి కంపెనీతో సుమారు దశాబ్దానికి పైగా ఒప్పందం చేసుకుని, నాణ్యమైన టైర్లను వినియోగదారులకు అందిస్తున్నాం. వినియోగదారుల నమ్మకాన్ని చురగొని, నాణ్యతలో రాజీపడకుండా వ్యవహరిస్తున్నాము. మా వద్ద అన్ని రకాల టైర్లు, ప్రముఖ కంపెనీలైన కాంటినెంటల్, బ్రిడ్జిస్టోన్, యోకోహామ, సియాట్ వంటి కంపెనీల టైర్లు కూడా తమ వద్ద సరసమైన ధరలకు లభ్యమవుతాయని, వినియోగదారులు దీన్ని సద్వినియోగం చేసుకోండి. వివరాలకు 9108414314 ఫోన్ నెంబరును సంప్రదించండి..

నిర్మాణ రంగంలో నాణ్యతకు మరో పేరు

ఆదిత్య బిల్డింగ్ సొల్యూషన్స్

ప్రజాశక్తి- తిరుపతి సిటీ: గత దశాబ్ద కాలానికి పైగా నిర్మాణ రంగంలో నాణ్యతకు మారు పేరుగా ఆదిత్య బిల్డింగ్ సొల్యూషన్స్ నిలుస్తోందని ఆ సంస్థ అధినేత మేళం నరేంద్ర తెలిపారు. స్థానిక తిరుమల బైపాస్‌రోడ్డులోని ప్రకాశం మున్సిపల్ పార్కుకు అత్యంత సమీపంలో ఉన్న ఆ సంస్థ కార్యాలయంలో ఆయన 'ప్రజాశక్తి'తో మాట్లాడుతూ.. ఆదిత్య బిల్డింగ్ సొల్యూషన్స్ ద్వారా అప్రూవల్స్, బిల్డర్స్, కన్సెక్షన్స్, ప్లానింగ్ అండ్ డెవలప్‌మెంట్స్‌లో తమకు తామే సాటిగా నిలిచామన్నారు. దశాబ్దకాలానికి పైగా నగరంలో తమ కార్యాకలాపాలు నిర్వహిస్తూ నాణ్యతకు మార్పుపేరుగా నిలిచామన్నారు. వినియోగదారులకు మన్నిక, నాణ్యతకు గట్టి భరోసా ఇస్తున్నామన్నారు. 30 సంవత్సరాలుగా సివిల్ ఇంజనీరింగ్‌లో రాణిస్తూ, ఆ అనుభవంతో పది సంవత్సరాలుగా తిరుపతిలో తమ సంస్థ ద్వారా మెరుగైన సేవలు అందిస్తున్నామన్నారు. హాస్పిటల్స్, స్కూల్స్, బారీ షాపింగ్ మాల్స్ నిర్మాణానికి సంబంధించిన డిజైనింగ్, ప్లానింగ్, ఆకర్షణీయంగా అందిస్తూ, త్వరతగతిన అప్రూవల్స్‌ను ఇప్పిస్తూ, వినియోగదారులు అభిరుచులకు తగ్గట్టు నిర్మాణాలను డిజైన్ చేసి అందిస్తున్నామన్నారు. ఇప్పటివరకు కేవలం తిరుపతి, పరిసరాల ప్రాంతాల్లోనే 70కి పైగా బారీ భవంతులు నిర్మించామన్నారు. పంచాయతీ, కార్పొరేషన్, మునిసిపాలిటీల్లో కూడా ఇంటి నిర్మాణానికి అవసరమైన అప్రూవల్స్ త్వరగతిన అందించి, వినియోగదారుల మన్నలను పొందుతున్నామన్నారు. తమ సేవలు అవసరమైన వారు 9133533289 ఫోన్ నెంబరును సంప్రదించాలని కోరారు.

కొండకు రోడ్డేసిన ఘనత విశ్వేశ్వరయ్యదే..

ఇంజనీర్స్ డే సందర్భంగా ప్రత్యేక వ్యాసం

ప్రజాశక్తి-తిరుపతి సిటీ: దట్టమైన అడవులు, ఎత్తైన గుట్టలు, భారీ చెట్లు, లోయలు తిరుమలకు రోడ్డు వేయడమంటే ఆషామాషీ విషయం కాదు. కష్టతరమైన ఈ పనిని చేసి చూపించారు. ప్రముఖ ఇంజనీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య. ఘాట్ రోడ్లంటే సాదాసీదా రోడ్లు కావు. ఎన్నో మలుపులు. శేషాచలం అడవుల్లో నుంచి వేసిన రోడ్లు ఇవి. 1944వ సంవత్సరం ఏప్రిల్ 10లో నాటి ప్రముఖ ఇంజనీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య ఈ ఘాట్ రోడ్డును వేశారు. మొదటగా ఘాట్ రోడ్డును అప్పటి మద్రాస్ గవర్నర్ ఆర్థూర్ హెూప్ ప్రారంభించారు. మొదట్లో ఘాట్‌రోడ్డులో చిన్నపాటి బస్సులు వెళ్లేవి. అవి క్రమేపి పెద్దదిగా మారాయి. అప్పటి నుంచి ఇప్పటి వరకు మోక్షగుండం విశ్వేశ్వరయ్య వేసిన రోడ్లపైనే వాహనాలు వెళుతున్నాయి. రోడ్లు వాడుతున్నారే గానీ, వేరే రోడ్లు మాత్రం వేయలేదంటే ఆయన ఘాట్ రోడ్డు వేయడానికి ఎంత శ్రమపడ్డారో ప్రత్యేకించి చెప్పనక్కర్లేదు. ఎంతో ప్రమాదకరమైన మలుపుల రోడ్లను వేయడమంటే సాదా సీదా విషయం కాదు. అప్పట్లోనే ఘాట్ రోడ్డు వేయడానికి సంవత్సరంకుపైగా సమయం పట్టిందంటే ఎంతకష్టమో ఇట్టే అర్థమైపోతుంది. అయితే ప్రస్తుతం తితిదే ఇంజనీరింగ్ అధికారులు మాత్రం తారు రోడ్డు మీద తారు రోడ్లు వేస్తూనే ఉన్నారు. తిరుమల ఘాట్ రోడ్డు వేసి 80 వసంతాలు పూర్తి కావడంతో తితిదే ఇంజనీరింగ్ విభాగం సంబరాలు చేసుకుంటోంది.

1944 సంవత్సరంలో వేసిన రోడ్లుపైనే మరో రోడ్లు వేయడం నిజంగా వారిని ఆశ్చర్యానికి గురిచేస్తోంది. తితిదే అధికారులను మాత్రమే కాదు తిరుమలకు వచ్చే భక్తులందరికీ ఘాట్ రోడ్లను చూస్తే ఆశ్చర్యపోక తప్పదు. తిరుమల ఘాట్ రోడ్డు ఎంత పేరుందో.. అంత ప్రమాదకరమైన మలుపులు. ఆదమరిస్తే పెనుప్రమాదం. వందల అడుగుల ఎత్తు. ఇలా ఎంతో చరిత్ర కలిగింది తిరుమల ఘాట్ రోడ్డు. తిరుమల ఘాట్ రోడ్లు మొత్తం రెండున్నాయి. మొదటి, రెండు ఘాట్ రోడ్డులుగా ఉన్నాయి. ఒక ఘాట్ రోడ్డు తిరుమలకు వెళ్లడానికి, మరో ఘాట్ రోడ్డు తిరుమల నుంచి కిందికి రావడానికి. తిరుపతి నుంచి తిరుమలకు ఘాట్ రోడ్డులో వెళ్ళాలంటే కనీసం 30 నిమిషాలకుపైగా సమయం పడుతుంది. అదే తిరుమల నుంచి తిరుపతికి రావాలంటే 45 నిమిషాల సమయం తప్పనిసరి. అత్యంత సాంకేతిక నైపుణ్యత ప్రస్తుతం అందుబాటులో ఉన్న 78 సంవత్సరాల క్రితం మోక్షగుండం వేసిన రోడ్లనే నేటికి వినియోగిస్తున్నారంటే ఆయన దూరదృష్టి ఏపాటితో అర్థమవుతుంది. అంతటి ప్రతిభపాటవాలు గల నైపుణ్యుడు కాబట్టే ఇంజనీర్లకు ఆదర్శప్రాయంగా నిలిచారు. సెప్టెంబరు 15 మోక్షగుండం విశ్వేశ్వరయ్య జన్మదినాన్ని పురస్కరించుకుని ఇంజనీర్స్ డేని జరుపుకుంటూ ఆయనకు ఘన నివాళి అర్పిస్తున్నారు.